# మానుపులి

పిట్టలు కీచుమంటున్నాయి.

ఉదయపు చలిగాలికి కళ్లు తెరవడానికే బద్ధకంగా వుంది. మా యింటి వాతావరణంలో మా తాతయ్య మాటలు వినబడుతున్నాయి. చప్పున కళ్లు తెరిచి చూచాను. తాతయ్య యెదురుగా కుర్చీలో కూర్చొని వున్నాడు. దగ్గిరగా అమ్మ నిలబడి కుశలప్రశ్నలు వేస్తూవుంది. నేనుఒక్క గంతులో తాతయ్యఒళ్లో వాలాను. తాతయ్య నన్ను ఒక్కసారి గట్టిగా అదుముకొని తన చేతిసంచిలోంచి కొన్ని పళ్లను నాకు యిచ్చాడు. సంతోషంలో కుప్పి గంతులు వేస్తూ యిల్లంతా పరుగెత్తాను. తాతయ్య అప్పుడే తెల్లవారుఝామున వచ్చే ఎక్స్‌ప్రెసుకు వచ్చాడని చెప్పింది అమ్మ. దసరాపండగకు తనను, మమ్మల్ని పుట్టింటికి తీసుకెళ్లడానికి తాతయ్య వచ్చినట్టుగూడా చెప్పింది అమ్మ.

తాతయ్య యిచ్చిన పళ్లను ఒక్కక్షణంలో స్వాహా చేశామని అరనిమిషంలో మొహాన్ని కడిగి నట్టుచేసిఒక్కొక్కపండుతొక్కలు

ధరణికోట
సవితార కుమార్ (13)
నల్లగొండ.

తీయడానికి ఉపక్రమించాను. తాతయ్యగూడా మొహం కడిగేసి అక్కడే వచ్చి కూర్చొని అమ్మ అందించిన వేడి కాఫీ వూదుకుంటున్నాడు. తాతయ్య మొదటి నుండి లావాటి మనిషి. ఈమధ్య మరింత లావెక్కింది ఆయనశరీరం.

'తాతయ్యా! మనప్రయాణం యెప్పుడూ?' అడిగాను తాతయ్యని.

'యెల్లుండి ఉదయంబండికి వెళ్లుదాంనాన్నా' అన్నాడు తాతయ్య. ఇంకేముంది. వెంటనే గదిలోకి వెళ్లి నా పెట్టెలో వుతికిన బట్టలు యెన్నివున్నాయని చూసుకున్నాను. రెండు పంట్లాములు. మొదలు ఇవి యేరంగు గల బట్టలో చెప్పడం కష్టం. తోళ్లలాగున్నాయి. వెధవ పంట్లాంలు. విసుగేస్తుంది. రెండేళ్లయినా యింకా చిరగడం లేదు. ......వెలవెలపోతూవున్న రెండు హాఫ్ షర్టులు అసహ్యంగా వున్నాయి. రెండుసార్లు కుట్టింది అమ్మచంకక్రింద చిరిగితే. యెలాగు తొడుక్కు వెళ్లేది ఈ బట్టల్ని తాతయ్యవూరికి. అయినా జ్ఞాపకం వచ్చింది. దసరాపండగకి నాన్నారు ఓపంట్లాము ఓషర్టు కుట్టించేరు. తాతయ్య తీసుకెళ్లితే ఆయనగూడా బట్టలు కుట్టించేస్తాడు పండగకి, అనుకున్నాను. అనుకోవడమేమిటి అడిగేశానుకూడా తాతయ్యని 'నాకు బట్టలు కుట్టిస్తారా' అని.

'ఓ. భలేబట్టలు కుట్టిస్తానులే" అన్నాడు తాతయ్య.

అమ్మ కళ్లెఱ్ఱచేసి నన్ను ఉరిమిచూసింది. ముక్కుమీద వేలు పెట్టుకుంది. అలాగ తాతయ్యను అడగడం తప్పు అన్నట్టుగా.

నేను ధోరణి మార్చేశాను. "తాతయ్యా! మీవూళ్లో మాను పులులున్నాయా" అన్నాను.


నూతన ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు
రవి టాయ్‌లెట్స్ వారి శుభాకాంక్షలు




రవి గ్లిసరిన్ సోపు, అన్ని కాలములలో వాడ దగినది. శరీరమును మృదువుగను కాంతిగల ఉంచును. రవి వెజిటబుల్ హేరా యిల్ శిరోజములను పెంపొందించి, సమ్మెద నలుపుగ నుంచి, కేశ సౌందర్యమునకు తోడ్పడును.




సోల్ ఏజంట్లు:
ది న్యూస్టార్ & కో,
తండియార్పేట, 10, వైద్యనాద మొదలి వీధి, మద్రాసు - 21.

"అలాంటివి యేమీ లేవులే" అన్నాడు తాతయ్య.

"ఈవూళ్లో మానుపులి రాత్రిళ్లు తిరుగుతూవుంది తాతయ్యా. చిన్న పిల్లల్ని యెత్తుకుపోతుందట. మేము రాత్రిళ్లు భయంగా వుంటున్నాం" అని, చెప్పాను తాతయ్యకి.


అదేం సంగతి అన్నట్టుగా తాతయ్య అమ్మ మొహం చూశాడు. అమ్మగూడా చెప్పేసింది తాతయ్యకి, మానుపులి నిజంగానే వూళ్లో తిరుగుతోందని, అందరు భయపడుతూ వున్నారని.

చూస్తూండగానే రాత్రి అయింది. అందరం భోజనాలు చేశాం. తాతయ్య వచ్చాడనో యేమో అమ్మ రోజుకంటె కమ్మగా కూరగాయలు వండేసింది. పడుకునే సమయం వచ్చింది. కింద దోమల బాధ బాగావుందని తాతయ్యకు డాబామీద పంచలో మంచం వేశారు. తాతయ్యవద్ద నన్ను గూడా పడుకొమ్మన్నారు. కాని నేను భయపడ్డాను. మానుపులి డాబాలపైకి గూడా యెక్కి పిల్లల్ని యెత్తుకుపోతుందని చెప్పగావిన్నాను. తప్పించుకొని నేను కిందనే నాన్నారి వద్ద పడుకున్నాను. యెల్లుండి ప్రయాణంకదూ, ఆ సంబరంలో నాకు చాలా రాత్రివరకు నిద్రపట్ట లేదు. తర్వాత రెండుమూడు గంటలు పడుకున్నానో లేదో వీధిలో పెద్ద గల్లంతు విని గాభరాపడి లేచాను. నేను లేచేసరికే అమ్మ, నాన్నారూ లేచి కూర్చున్నారు.

వీధిలో కేకలు వినబడుతున్నాయి. కిరసనాయిలు డబ్బాలను కర్రలతో గొట్టి ధ్వనిచేస్తున్నారు. 'మానుపులి. జాగ్రత్త. మానుపులి జాగ్రత్త' అని మా యింటిముందే కేకలు వేస్తున్నారు. నాకు చెమట లొచ్చేశాయి. గుండె వేగంగా కొట్టుకుంటూంది. నాన్నారు గూడా కంగారుపడుతున్నారు. నాన్నారి వెనకాలే తిరుగుతున్నాను నేను. అమ్మగూడా భయంతో వణికిపోతూవుంది. 'మానుపులి మా డాబామీదనుండే గురుగురు మంటోందండో' అని మా తలుపులు బాదారు. నా ప్రాణం అమాంతంగా లేచిపోయింది. డాబా మెట్ల




S. 207-50 TL



కొత్త పళ్లు

ఫోటో : వీరపనేని కుటుంబరావు (మద్రాసు).

## ★ మానుపులి ★

నుండి కిందికి వచ్చి నన్నెక్కడ యెత్తుకుపోతుందో అని మరింత భయపడి ఒక్కసారే బావురుమన్నాను. నాన్నారు నన్ను కోపం చేసి సముదాయించారు. యేడుస్తూ వుంటే నానోరు నొక్కేశారుకూడా.

ధైర్యంచేసి నాన్నారు వీధి తలుపులు తీశారు. గుంపులోంచి యిద్దరు యువకులు, మానాన్నారు చేతిలో కర్రలు పుచ్చుకొని మెల్లగా డాబా యెక్కి ఆజంతువు కిందికి రాకుండా వుండడానికో యేమో డాబా నుండే తరిమివారేయాలని చూస్తూ నిలబడిపోయినారనుకుంటా. మా నాన్నారు మాత్రం ధైర్యంచేసి డాబామీదికి పొంచి చూస్తున్నారు. గుర్రు... గుర్రు...గుర్రుమని ఏకధాటిగా ధ్వని వినబడుతూనే వుంది డాబామీద.

"అరే పిచ్చినాయనమ్మలారా. మానుపులీ కాదు మన్నూ కాదు. మా మామయ్యర్రా. నిద్రలో గురక పెడ్తున్నాడు" అన్నారు నాన్నారు పెద్దగా - యింకేముంది. అందరు ఒక్కపెట్టున గొల్లుమని నవ్వారు. ఇంటిముందున్న వాళ్లందరూ డాబాపైకి పరుగెత్తారు. తాతయ్య మాత్రం గురక పెడ్తూ నిద్రపోతూనే వున్నాడు. అందరు పొట్టలు పగిలేటట్టు నవ్వుతున్నారు ఆయన చుట్టూ నిలబడి. ఆయనకు ఆ నవ్వుల పెద్దధ్వనికి మెలకువవచ్చింది. తన చుట్టూ అంతమందిని వాళ్ల చేతులలో కర్రలు అవీ చూచి తాతయ్య గాభరాపడి, ఉక్కిరి బిక్కిరి అయిపోయినాడు. నోరువిప్పి వెర్రివాడిలాగు అరుపులు మొదలెట్టాడు. మా అమ్మ తాతయ్యను భయపడవద్దని చెప్పి, జరిగిన సంగతంతా చెప్పేసింది. కొంతసేపట్లో అందరు నవ్వుతూ ఎవరి యిళ్లకి వాళ్లు వెళ్లారు.

తెల్లవారింది. వూళ్లో వాళ్లు తండోపతండలుగా వచ్చి మానుపులి అరచినట్టుగా గురకపెట్టిన మా తాతయ్యను వింతమృగాన్ని చూచినట్టుగా చూచి వెళ్లారు.

తాతయ్య మావూరు వచ్చినప్పుడల్లా 'మానుపులి వచ్చింది' అని నేను అన్నానంటే 'ఛ - భడవా' అంటూ నా లెంపలపై చిటుకులు వేస్తాడు తాతయ్య. ★